# చెరివీనా బూక్కా

–రమాదేవి

మంగమ్మ తోమిన గిన్నెలు బోర్లించి, ఇల్లు ఊడ్చి పని పూర్తి అయిందన్న దానికి సంకేతంగా నడుం చుట్టూ తిప్పి దోపిన కొంగు విప్పి ఒకసారి దులిపింది.

"అమ్మా! నే యెల్తున్నా. . ." అని చెప్పింది.

వంట గదిలో ఉన్న వసంత నుండి సమాధానం లేదు. మంగమ్మ గుమ్మం దిగింది. లోనుండి వసంత ఆదరా బాదరాగా వచ్చి, "ఏమిటా తొందర?" అంటూ సాయంత్రం చేసిన బజ్జీలు రెండు ఆకులో పెట్టి మంగమ్మ చేతి కిచ్చింది. ఆకు పొట్లం చుట్టి కదిలింది మంగమ్మ. వసంత కొంచెం అటూ ఇటూ చూసి, ఎదరింటి పిన్నిగారు కనిపించాక తృప్తిగా లోనికి నడిచింది.

వసంత ఏం చేసుకున్నా మంగమ్మకు కొస్త పెడుతుంది, ఇస్తుంది. ప్రతి రోజూ పచ్చడో, కూర పిసరో, ఒక్కొక్కప్పుడు మిగిలిన అన్నంలో కొంచెం చారు పోసి, "బోడిగాడి కోసం, మంగమ్మా!" అంటుంది.

కాని, ఆ ఇచ్చేది— "యెల్తున్నానమ్మా" అన్నప్పుడు ఇవ్వదు. గుమ్మం దిగ్గానే ఇస్తుంది. ఆ ఇచ్చేటప్పుడు ఇరుగు పొరుగు, ఎదటి వాళ్ళు చూస్తే ఆమెకు చాలా తృప్తిగా ఉంటుంది.

మంగమ్మ నాలు గిళ్ళలో పని చేస్తోంది. ఆమెకు నలుగురు పిల్లలు. మంగమ్మ మొగుడు గురవయ్య కూలి దొరికిన రోజున వెళతాడు. లేని రోజున లేదు. నికరమైన ఆదాయం మంగమ్మదే. నాలుగిళ్ళలో నూ పని చేస్తున్న మంగమ్మ వాళ్ళిచ్చే రని వీళ్ళకీ, వీళ్ళిచ్చేరని వాళ్ళకీ చెబుతూ ఉంటుంది. అందులో ఆ ఇచ్చే వారిని గొప్ప చెయ్యాలని కాదు. అదో క లౌక్యం. ఒక రిచ్చారంటే మరొకరిస్తారని. అయితే, మిగతా మూడిళ్ళ లో నూ మంగమ్మ లౌక్యం పని చెయ్యలేదు. వారందరివీ పిల్లలు గల పెద్ద కుటుంబాలు. రెండోది ఈ పని వెధవల బుద్ధే అంత అనుకుని మిగిలితే ఇస్తారు, లేకపోతే లేదు. వసంత మాత్రం 'పేద ముండా కూతురు—పోనీ చెప్పుకుంటుంది' అని కొస్త మిగిలేపి అయినా ఇస్తుంది. అలా ఊరికే ప్రచారం చేసే మంగమ్మకి వసంతమ్మే మంచి దయింది. మిగతా వాళ్ళ మీద మంటతో ఇంత ఇస్తే అంతగా చెప్పుకు తిరుగుతుంది. ఆ మాటలు విన్న వసంతకు మంగమ్మ మీద అభిమానము, జాలికూడా పెరిగాయి సహజంగానే.

వసంతకు ఇద్దరే పిల్లలు. తొమ్మిదేళ్ళ పాప. ఏడేళ్ళ బాబు. స్కూలుకి వెళుతున్నారు. భర్త ఏదో ఆఫీసులో మూడు వందల జీతం తెచ్చుకుంటున్నాడు. ఏదో ఒడుదుడుకులు లేకుండా గుట్టుగా సంసారం నడిచి పోతుంది.

మంగమ్మ ఇంటి దారి పట్టింది. నాలుగిళ్ళ అవతల డాక్టరుగారి ఇంట్లో వారి పనిమనిషి గౌరమ్మ బయటకు వచ్చింది.

"యేటప్పా! పందీర్చుక పోతన్నావా?" అని పలకరించింది.

మంగమ్మ ఆగి, "పొద్దోయిందే—పొద్దెక్కి వేలయింది. ఆ డాక్టరిసరి కుంటేనే కూల్డబ్బులు సేతి కొత్తయి" అంది.

"నీ పిచ్చిగానప్పా, అంతా లాగేస్తాడేటి?"

"ఆడి మొగం కాల. నా ప్రాణాలు దాత్తే, రెండినా లాగెత్తాడు."

"అలాగేలే. మొగోడవ్వాక ఆడికీ కర్చులుంటయ్ మరి. నీ మరిది సూడు . . . ఆడి జీతం ఆ బాంకీ టిడీలకే సరిపోద్ది. ఏదో అవుటినకామ్ ఉంటాన గడిసి పోద్ది గాని. . ." గౌరమ్మ అవుటిన కామ్ మాటల్లో పడితే మరి తేలదు. అందుకని మంగమ్మకి భయం వేసింది. ఈ లోగా గౌరమ్మ కొడుకు మూడేళ్ళ వాడు లోపల్నుండి వచ్చాడు.

"యేటే, గౌరీ! ఈడికూ్కడా టొంయి నింగు ఇస్తన్నావేటి?" గౌరమ్మ మాట మార్చటానికి మంగమ్మ పరాచికం ఆడింది. చేతిలో ఉన్న పొట్లం విప్పి, ఒక బజ్జీ తీసి వాడి చేతిలో పెట్టబోయింది.

"ఒద్దొద్దు. ఉన్నయ్యే. బోడిగాడు సూస్తుంటాడు. ఒసంతమ్మగా ఇచ్చింది? ఈ యెదవ ఇప్పుడే బిసుకుత్తులు తిన్నాడు. ఇలాటివి తిన్నాడంటే కడుపు సెడిపోద్ది. . ." అని మంగమ్మని ఆపు చేసింది.

ఇలాంటి మాటలు అన్నప్పుడే గౌర పిస్తంటే మంట మంగమ్మకి.

"పర్లేయత్తె. నే యెల్తా..." అనేసరికి, "ఉండుండు. . ." అని చెప్పి గౌరమ్మ లోపలికి వెళ్ళి గుప్పెడు చిన్న బిస్కట్లు తెచ్చింది.

"కొంగు నేసుకో, అప్పా! పిల్లల కియ్యి. దినాని కల్లా ఈడు తింటూనే ఉన్నాడు. ఇలాటి అవుటినకామ్‌లు నే పోతే పొద్దుస్తమించి పోద్దోయిందాకా ఈ పాకిరీ యెవుడు సేస్తాడు" అన్నది గౌరమ్మ.

గుప్పెడు బిస్కట్ల కోసం ఈ అవుటినకామ్ చర్చ వినే ఓపిక లేదు



రణరంగం

ఫోటో— శ్రీశైలం (సికింద్రాబాదు)

మంగమ్మకి. "వస్తానుండు"... అనేసి కదిలింది.

గౌరమ్మ పని చేసే ఇంట్లో భార్యా భర్తలిద్దరూ డాక్టర్లే. వాళ్ళకో మూడేళ్ళ బాబు ఉన్నాడు. ఇంటి బాధ్యత, బాబు బాధ్యత గౌరమ్మదే. తిండి, బట్టకాకుండా అరవై రూపాయ లిస్తారు వాళ్ళు. ఇద్దరూ ఇంట్లో ఉండరు కనక గౌరమ్మదే రాజ్యం. బియ్యం, పప్పులు, పంచదార వంటి సామానులతో సహా పౌడర్లూ, క్రీములూకూడా గౌరమ్మ ఇంటికి చేరుకుంటాయి. గౌరమ్మ భర్తకికూడా క్లీనరుద్యోగం వల్ల లైను మీద తన ఖర్చులు పోగా జీతం, పైన రాబడికూడా ఇంటికి తెస్తుంటాడు. ఒక్కడే కొడుకు. అందుచేత వాళ్ళ పేటలో గౌరమ్మ కలిగి నమ్మ. అవుటేసకావ్ లెక్చరు విన్న వాళ్ళకి ఏదేనా వస్తువు ఉంచుకుని అయిదూ పదీ సాయం చేస్తుంటుంది వడ్డీకి. ఆ వీధిలో (పనిచేస్తున్న వీధిలో) కూడా అవసరం ఉన్న వాళ్ళకి ఎవరి దగ్గిరో తెచ్చానని పది పైసలు, అయిదు పైసలు వడ్డీలకు డబ్బు ఇస్తూంటుంది

• • •

మంగమ్మ ఇంటికి వచ్చేసరికి ఉసుమ్మలో దొర్లుతూ ఏడుస్తున్నాడు బోడిగాడు. వాడి కంటె పెద్దది— "ఊకోరా..." అని ఊరడిస్తూంది.

"అయ్యొయ్యొ నాడేటి?" బోడిగాణ్ణి ఎత్తుకుని అడిగింది మంగమ్మ.

"నేదు... రాడు గంటయి ఏడుస్తున్నాడు. బుజ్జిగాడు కొట్టిండు. అప్పేమో కలాయి కెల్లింది" అని అయిదేళ్ళ పిల్ల ఆరిందాలా చెప్పేసింది.

బజ్జీలు, బిస్కట్లు పిల్ల లందరికీ పంచి పెట్టింది.

'ఈ గౌరి ముండదే అదృష్టం. ఆడికీ లారీ క్లీనరుద్యోగం. దీనికీ డాకటేరింట్ల పని. ఒక్క కొడుకు. డాకటేరు కొడుకు దినాల్సిన వన్నీ దీని కొడుకు తింటాడు. డాకటేరమ్మ, బాబు దినేవన్నీ ఇది, దీని మొగుడు దింటారు. వారాని కో సినిమాకి డాకటేరమ్మలా తయారయి యెల్తాది. బజ్జీ ముక్క దింటే దీని కొడుకు కడుపు పెడిపోద్దట. యేవి నిక్కు... డబ్బే సేస్తాది యేదేవా...' అనుకుంది. సాయంత్రం అయిపోయింది. ఇంట్లో దీపానికి కిరసనూనె లేదు. గురవయ్య వచ్చి మూడు రూపాయలు మంగమ్మ చేతిలో పెట్టేసి మళ్ళీ వెళ్ళిపోయాడు.

"మూ(డూపాయల్తోటి ఏటి సెయ్యాలేటి?" అన్న మంగమ్మ మాటలు భర్త చెవుల వరకూ వెళ్ళనే లేదు.

గొణుక్కుంటూ లేచింది. "లచ్చీ! ఆ కిర్సనాయిలు సీసా, నూని సీసా, వంటి అంతా బత్రాయే" అని పెద్ద కూతురికి పురమాయించింది. ఎలాగో తడువుకుని తెచ్చి ఇచ్చింది లచ్చి.

"యేం బతుకులో... కూలొచ్చిం దాకా బంగ్డీ అయినా యెల్లదు. యే పూట కా పూటే సావు..." అనుకుని గొణుక్కుంటూ బజారు వైపు వెళ్ళింది.

• • •

వసంత చెల్లెలు కరుణ పిల్లలతో హైదరాబాదు నుండి వచ్చింది. చెల్లెల్ని చూసేసరికి వసంతకు ఎంతో ఆనంద మేసింది. ఒకప్పుడు కరుణ భర్తకూడా ఇదే ఊళ్ళో తక్కువ జీతంతో ఉండే వాడు. కరుణకు అత్త మామలుకూడా ఉండటాన ఇంట్లో ఇబ్బందిగా ఉండేది. వసంతకు ఎప్పుడూ బెడద కాకపోవటాన చెల్లెల్ని కాస్త చూసుకునేది. కరుణకు చీర లేకపోతే తన చీరలు ఇచ్చేది. కరుణ కూతురు వసంత కూతురు కన్నా రెండేళ్ళ చిన్న అవటాన పొట్టి అయిపోయిన గౌన్లన్నీ చెల్లెలి కూతురుకి కట్టబెట్టేది.

కరుణ భర్తకు హైదరాబాదులో అయిదు వందల రూపాయల జీతం మీద ఉద్యోగం దొరకటం వల్ల మూడేళ్ళ క్రితం వెళ్ళిపోయింది. ఈ మూడేళ్ళకూ అక్కను చూడటానికి ఇదే రావటం వల్ల వసంతకు చాలా సంతోషంగా ఉంది. కాని, కరుణలో కొట్టవచ్చినట్టు కనిపించే మార్పు వసంతకు కొంత ఆశ్చర్యంగానే ఉంది.

అరవై డెబ్భై ఖరీదు గల చీరలు మామూలుగా కట్టేసి తడిపేస్తుంటే— "రాత్రి చీర మార్చేయలేక పోయావా?..." అంది వసంత.

"నే నిప్పుడు చిన్న ఖరీదులవి కొనటం లేదక్కా. వెధవ గుడ్డలు రంగులు వెలిసి పోవటమే" అన్నది నవ్వుతూ. అవాక్కయి పోయింది వసంత.

తెల్లవారి టిఫిన్ల తరవాత పాలు కలిపి పిల్లల కివ్వబోతే— "ఉండక్కా! బోర్నవిటా తెచ్చాను. వాళ్ళత్త పాలు తాగరు" అంటూ డబ్బా తెచ్చింది. పాలల్లో బోర్నవిటా కలుపుతూ, "ఏమి టక్కా! ఈ ఊరు పాలు ఉత్త నీళ్ళు!..." అంటూ ంటే ఒళ్ళు మండి పోయింది వసంతకు. కాని, ఏమీ అన లేకుండా ఉంది. వాళ్ళ స్టేటస్ మారి పోయింది. పైగా రెండు రోజు లుండి వెళ్ళటానికి వచ్చింది.

వసంత భర్త సుందరం మౌనంగా వడ్డిస్తున్న భార్యను చూసి, "ఏమిటోయ్! మీ చెల్లెలు వచ్చి నిన్ను మూగ చేసే సిందా?" అని హాస్య మాడాడు. వసంత ఏదో అనబోయేంతలో కరుణ వచ్చి, "బావా! సాయంత్రం త్వరగా రావాలి. పిల్లలు ఊరు చూస్తా మంటున్నారు" అన్నది. "అలాగే..." అంటూ భోజనం ముగించి లేచిపోయాడు సుందరం.

వసంతకు గొప్ప కుతకుతగా ఉంది. మూడేళ్ళుకూడా నిండా కాలేదు వీళ్ళు ఊరు వదిలి. కొత్త ఊరు వచ్చినట్టు ఊరు చూట్టమేమిటి అనుకుని, "ఊరేం చూస్తారు? పాత ఊరేగా? ఏదేనా సినిమా కెళదాం" అంది, సహనం తెచ్చుకుంటూ.

"సినిమాకా? ఈ పిల్ల వెధవలతోనా?..." కొత్త మాట విన్నంతగా ఆశ్చర్య పోతూ అన్నది కరుణ.


'ఏమిటీ మార్పు? ఒక వందో, రెండు వందలో ఎక్కువ జీతం, నిజమే! హైదరా బాదు సిటీలో ఉన్నారు నిజమే. అయితే ఇంతగా మారిపోతారా? అయినా ఆ మహా నగరంలో వీళ్ళ జీతం?' ఉండబట్టలేక అడిగేసింది—

"కరుణా! అక్కడన్నీ ఖరీదు ఎక్కు వంటారు కదా!"

"నిజమే, అక్కా! వారి జీతం పది రోజులకి సరిపోదు. కాస్త అవుటు సైన్‌కమ్ ఉండటాన..." వసంత మరి నిసదులుచు కోలేదు. "పాలు పొంగి పోతున్నాయిలా ఉంది..." అంటూ లోపలికి నడిచింది.

• • •

సాయంత్రం వసంతే పిల్లలందర్నీ ముస్తాబులు చేస్తూంది. తన పిల్లల బట్టలు పెట్టెలోంచి తీసేసరికి మూడేళ్ళ క్రితం బాబు కోసం కొన్న టెరీలిన్ చొక్కా బయట పడింది. ఆ నీలం రంగు టెరీలిన్ చొక్కా గులాబి పూలు ఎర్రని దారంతో ఎంబ్రాయిడరీ వర్కుతో చూడ ముచ్చటగా ఉంది. ఆ సంవత్సరం పుట్టిన రోజుకి కొన్నది కాని, ఆ చొక్కా అంటే వసంత కెంతో ఇష్టం అవటాన బాబుకి అప్పుడు అప్పుడూ తొడగటాన






ఒక ఏడాది దాటేవరికి చిన్నదయి పోయింది. అయినా, దాని మీద మోజు కొద్దీ చెల్లెలు కొడుకు కోసం దాచింది. అది బయటకు తీసి కరుణ కొడుక్కి తొడిగింది.

లోపలినుండి కరుణ వచ్చి, "ఇదెక్కడిది . . ." అని అడిగింది.

"కిష్టిగాడిదే. వాడికి చిన్నదయి పోయింది. ఈ వెధవకి సరిగ్గా సరి పోయింది" అంది మురిసి పోతూ. కరుణ ముఖంలో మారే రంగులుగా చూళ్ళేదు.

"పిల్లకి అన్నీ మాట్లే కుట్టిస్తాను. దీనికి మాచ్ అయేపాంటు లేదు—తీసెయ్" అంటూ తనే తీసేసి పెట్లోంచి టెరికాట్ బెల్ పాంటూ, అదే రంగు గుడ్డా షర్టు ఆ చిన్న బాబుకి తొడిగింది. కళ్ళనీళ్ళ పర్యంతం అయింది వసంతకు.

"ఈ రోజుల్లో పిల్లలకు చెప్పలేం, అక్కా! ఈ ఒక్క వెధవ ఆరు మాసాల క్రితం నుండీ ఇలాంటి చొక్కాలు వేసుకోనని గోల. అవన్నీ పని మనిషికి ఇచ్చేసి ఇవి కుట్టించాం" అన్నది.

చెల్లెలు అలా అంటుంటే గిలగిల లాడింది వసంత మనసు. ఉక్రోషం వచ్చింది. మరి సహించ లేకపోయింది. "నేనూ మంగమ్మ కొడుక్కి ఇచ్చేద్దా మనుకున్నాను. పాప గౌన్లన్నీ నీ కూతురు తొడిగింది కదా అని దీన్ని ఉంచాను. . ." కసిగా అనేసి, "మంగమ్మా. . ." అంటూ పిలిచింది.

పెరట్లోంచి చేతులు తుడుచుకుంటూ మంగమ్మ వచ్చింది. అక్కడ విప్పి పడి ఉన్న చొక్కా తీసి, "ఈ చొక్కా ఎప్పుడో బోడిగాడికి ఇచ్చేయాలనుకున్నాను. ఏమిటో అలా ఉండి పోయింది. తీసుకో. . ." అంటూ మంగమ్మ మీదికి విసిరింది. అది అందుకున్న మంగమ్మ అయోమయంలో పడింది. పాత అనుకున్న ఆ చొక్కా మంగమ్మ చేతుల్లో సరి కొత్తగా మెరిసి పోతూంది. అదేం పట్టించుకోని చెల్లెల్ని చూసిన వసంత మరింత ఉడి పోతూ, "అలా చూస్తావేం తీసుకెళ్ళు" అని మంగమ్మని కసిరి వంట గదిలోకి చరచరా వెళ్ళింది.

ఆ చొక్కాను మంగమ్మ భద్రంగా, సుతారంగా పట్టుకుని మడత పెట్టింది. వసంత అప్పుడూ అప్పుడూ పాత చీరలు ఇవ్వటం మామూలే. కాని, ఈ చొక్కా . . . మంగమ్మ అయోమయంలోంచి తేరుకోలేదు.

పనులు పూర్తి చేసుకుని చొక్కా పట్టుకుని నిలుచుందిమంగమ్మ. "అమ్మా! నే వెళ్తున్నా..." అన్నది. మంగమ్మకి ఇంకా అనుమానంగానే ఉంది, కోపంలో

తన మీదికి విసిరేసిందేమో నని. పని తొందర్లో ఉన్న వసంత—"ఆడవేళ్ళు..." అనేసి చెల్లెళ్ళి చూసి, "రేపు బోడిగాడిని ఆ చొక్కా తొడిగించి తీసుకు రా" అన్నది అక్కస్సుతో.

మంగమ్మ కదిలింది. కాళ్ళు నడుస్తున్నా, మనసు ఉరకలు వేస్తోంది. ఎదురు చూడని ప్రమోషన్ ఆర్డర్ అందు కున్న గుమాస్తాలా, ఫెయిలవుతా ననుకున్న విద్యార్థి తన నెంబరు పేపరులో చూసినట్టుగా...ఇంకా ఎలాగో ఎలాగో ఉంది. 'ఈ చొక్కా బోడిగాడికి తొడిగిస్తే. . .గౌరమ్మ కొడుకంత ముద్దుగా, చ. చ. డాక్టరుగారి కొడుకంత ఠీవిగా . . .'

"యేటప్పా! ఉయ్యేల పరిగెడుతున్నావ్. . ." గౌరమ్మ మాటలతో ఆగిపోయింది. మంగమ్మ ముఖం లోని వెలుగు, చేతిలోని చొక్కా మెరుగూ కూడా గౌరమ్మ కంట పడ్డాయి.

"అదేటది" అని అడిగింది.


"ఇది సొక్కాయే. ఒసంతమ్మ కొడుక్కి సిన్నబోయిందిట. బోడిగాడికి ఇచ్చిం దా యమ్మ." సంతోషంతో తల మునక లవుతాంది మంగమ్మ. ఆమె చేతిలోని చొక్కా తీసుకుని మడత విప్పి చూసిన గౌరమ్మ కళ్ళు జిళ్ళుమన్నాయి. 'నా కంటే దీని బతుకే బాగుంది. నాదేం అవుటినకాం దొంగతనంగా తీసి కెళ్ళటమేగా. ఆయమ్మ న్యాటాన ఎంత దరిజాగా దీసి కెల్తోంది' అనుకుని ఆ చొక్కాలో బోడిగాడు—'సీ. ఆ యెదవ కిదొక్కటే దక్కువా!' ఈర్ష్య లాంటిది ఆవహించింది గౌరమ్మ మనసులో. ఆ చొక్కాలో తన కొడుకుని ఊహించు కుంది. ఆ ఊహ దాచుకోలేక—

"ఈ చొక్కా సాన బావుందే! ఆ బోడెదవ ఒక్క రోజుకే మన్ను సేసేస్తాడు. మూడో, నాలుగో ఇస్తాను కాని, ఇది నా కిచ్చెయ్. పోని బోడిగాడికి మరో చొక్కా ఇస్తాలే" అంది.

మంగమ్మ ఆ మాట వినగానే అదిరిపోయింది. 'ఈ ముండకి ఎంతాస?' అనుకుని, దీనితో మాటలు పెంచకూడదు అనుకుని—"సూద్దాం లేయే! మా వొచ్చి వేలయింది" అని చొక్కా తీసుకుని వడివడిగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయింది. గౌరమ్మ మూతి మూడు వంకర్లు తిప్పి, "యేవి నీలుగో!"అంటూ రుసరుసలాడింది.

● ● ●

కరుణ వాళ్ళు వెళ్ళిపోయాక వసంతకి కొస్త ఊపిరి సలిపినట్టయింది. చెల్లెలు



కిన్నెరసాని

ఫోటో—ఎ. వి. రమణరావు (బొంబాయి)

వెళ్ళిపోయినా, ఆమెలోని మార్పును జీర్ణించుకో లేకపోయింది వసంత. తనలో తను మథన పడలేక భర్తకుకూడా చెప్పింది.ఆ చెప్పటంలో టెరిలిన్ చొక్కా విషయంకూడా చెప్పింది.

అంతా విన్న సుందరం నవ్వుతూ,

"మీ చెల్లెలులో మార్పు రావటం సహజమే, వసంతా! ఒక మెట్టు మీంచి మరో మెట్టు ఎక్కితే కింద మెట్టు మరిచిపోవటానికే ప్రయత్నిస్తారు. మన్వెంతో ప్రేమతో ఉంచిన ఆ చొక్కా విలువ ఆమెకు తెలిక పోవటం కాదు. మ వ్విచ్చింది తీసుకుంటే మళ్ళీ గతంలో నీ సాయం పొందిన అనుభూతి కలగవచ్చు. ఇప్పటి పరిస్థితిలో అది ఆమె సహించ లేదు. ప్రతి వారూ పై అంతస్తు కోసమే చూస్తారు. కాని,కిందికి దిగటానికి ప్రయత్నించరు. పోనీ ఇలాగైనా మ వ్వొక మంచి పని చేశావు" అన్నాడు.

"ఏమిటది?."

"అదే— ఆ చొక్కా నీ కెంత ఇష్టమయిందయినా అవసరం లేనిది. దాని విలువ ఎంతయినా తన అంతస్తుని జార్చుకో లేదు నీ చెల్లెలు ఆ చొక్కాతో. కాని, అదే చొక్కా మంగమ్మకి ఎంత ఉపయోగకరమో తెలుసా?"

అప్పుడు జ్ఞాపకం వచ్చింది వసంతకు. 'అవును. మంగమ్మ ఆ చొక్కాను ఎంత పదిలంగా ఒక వరంలా అందుకుంది! వచ్చడి పిసరతో, పాత చీరతో పొగుడు కుంటూ తిరిగే మంగమ్మ ఈ చొక్కా తన కొడుక్కి తొడిగించి ఊరూ వాడా తన పేరు చెప్పుకోదూ?'

అలా ఆలోచిస్తున్న వసంత మంగమ్మను చూడగానే—"ఏం, మంగమ్మా, నీ కొడుక్కి ఆ చొక్కా తొడిగించావా?" అని అడిగింది.

"దసరా ముందు వస్తుందమ్మా! ఆవేల తొడిగించేత్తా" అని అంట్లు పట్టుకుని పెరట్లోకి నడిచింది.

ఆ మాటలు విన్న వసంత హృదయం తృప్తితోనూ, ఆనందంతోనూ నిండింది. 'పండగ రోజు కోసం తనిచ్చిన చొక్కా దాచుకుందా? చెల్లెలు చీదరించుకున్న ఆ చొక్కాతో మంగమ్మ పండగ చేసుకుంటుంది!' ఆ చొక్కాకు తను అనుకోని విలువ లభించినందుకు మంగమ్మ మీద అపారమైన అభిమానం కలిగింది.

రోజూ కంటే ఆ రోజు తను చేసిన ఉప్మా ఎక్కువగా పెట్టింది మంగమ్మకు.

● ● ●

వారం రోజులుగా ముసురుగా ఉంది. అప్పుడూ అప్పుడూ వర్షంకూడా కుండపోతగా కురుస్తోంది.

'వెధవ్వర్షం ఇల్లు కదల్నివ్వకుండా ఉంది' అని చికాకు పడుతున్నారు రోడ్లు సర్వే చేసే రోమియోలు.

'ఏం వర్షం, బాబూ, ఉతికిన గుడ్డ ఒయినా ఆరకుండా ఇల్లంతా చెమ్మగా కంపు కొడుతూ ందే?' విసుక్కుంటున్నారు గృహిణులు.

'అబ్బ, ఒకటే ముసురు పెట్టేసింది. ఆఫీసుకి వెళ్ళి వచ్చేసరికి తడిసి చస్తున్నాం . . .' అని బాధ పడుతున్నారు చిన్న చిరు ఉద్యోగులు.

మంగమ్మ మొగుడికి కూలి లేక వర్షాన్ని చూస్తూ నోటికివచ్చిన బూతులు తిడుతున్నాడు. రెండు రోజులై నూక లైనా తెచ్చుకుని గంజి కాచుకున్నారు. ఆ రోజు అదీ లేదు. మంగమ్మ తడుస్తూనే పనిలోకి వెళ్ళింది.

వర్షం చూస్తూ కాస్సేపు, తడుస్తూ కాస్సేపు ఆకలి మరుస్తున్నారు పిల్లలు.

గురవయ్యకి నోరెండు కుంది. పని లేక సాయంత్రం పూట చుక్క పడక పోతే పోయె! తెల్లారినప్పటి వించీ చా నీళ్ళుకూడా లేవు.

ఇప్పుడు అందరికీ అమ్మ మంగమ్మే! మంగమ్మ రాక కోసం నిరీక్షిస్తున్నారు— 'అమ్మొస్తే నూక లయినా తెస్తాది' అనుకుంటున్నారు పిల్లలు. 'ఈ మంగి ఎవర్నయినా అడిగి డబ్బులు తెస్తే అద్దు రూపాయయినా దీసుకోవాలి. నాల్రోజులుగా సుక్కెయ్య లేదు. ఎదవ ముసురు సలి— వణికించేస్తాంది' అని ఆశ పడుతున్నాడు గురవయ్య. "ఒరేయ్! యెందుకల్రా తడుస్తుండ్రు. ఈ దరిద్రానికి తోడు ఉష్ణాలుకూడా వస్తాయ్" అని పిల్లల మీద కేక వేశాడు, మంగమ్మ రావటం క్షణ మొక యుగంలా బాధ పడుతూ. అలా కసురు కున్నాడే కాని, వాళ్ళు ఇంట్లోకి వస్తే ఆకలంటారని అతడికీ తెలుసు. చింకి గుడ్డ ఒకటి కప్పుకుని మంగమ్మ దారివే ఎదురు చూస్తూ కూర్చున్నాడు.

మంగమ్మ వస్తూంది. ఆమెను చూడగానే అందరి కళ్ళూ ఆశగా చూశాయి. అమ్మను చూడగానే ఆకలి జ్ఞాపకం వచ్చింది. మంగమ్మతో అందరూ లోపలికి వచ్చారు. గురవయ్య నాలికకి పెదాలు తడుపుతున్నాడు. మంగమ్మచేతులు ఖాళీగా ఉన్నాయి. నీరసంగా కూలబడి పోయింది. ఆమెను చూడగానే అందరికీ ఏదో తెలిసి పోయింది. బోడిగాడు ఒడిలో చేరి గునుపు ప్రారంభించాడు. ఎడపిల్ల పక్కకు చేరి "ఆకలే!" అంది. పెద్దవాళ్ళిద్దరూ దూరంగా బొమ్మల్లా నిలబడ్డారు. ఆకలి దహించేస్తున్నా అడగటానికి భయం. తల్లి నుండి ఏ జవాబూ రాకపోయేసరికి ఏడుపు లంకించుకుంది. మంగమ్మకీ ఆకలి వేస్తూంది. పని చేసుకుని చినుకుల్లో తడిసి రావటాన నీరసంగానూ ఉంది. చలి వేస్తూంది. కాని, ఆకలికి ఏడుస్తున్న చిన్న పిల్లల్నీ, ఆకలి చూపులతో నిలబడిన పెద్ద పిల్లల్నీ చూస్తే తన సంగతి మరిచి పోయి వారిని సముదాయించలేని తన అశక్తత మీద కోపంతో గింజుకుంది.

"ఎందుకే ఏడుపు? అందరూ కలిసి నన్ను తినేయండ్రా!" అని కేక వేసింది. ఏడ్చే పిల్ల మరింత స్థాయి హెచ్చించింది. ఎదురుగా మొద్దయి కూర్చున్న మొగుణ్ణి చూస్తే మరీ మండుకొచ్చింది. ఏడుస్తున్న పిల్లని నాలుగు బాదింది. అప్పుడు గురవయ్యలో చలనం కలిగింది. దెబ్బలు తిన్న పిల్లని దగ్గిరికి తీసుకున్నాడు.

"ఏ యమ్మ నయినా రెండ్రూపాయలు అడగలేక పోనావా?" అన్నాడు, మళ్ళీ పెదాలు తడుపుకుంటూ.

"నెలాఖరు రోజులు ఎవల్దగ్గి రుంటాది?. . ." విసురుగా అని, గోడకి చేరగిలబడి కళ్ళు మూసుకుంది.

మంగమ్మ అలా అనేసింది కాని, ఆ ప్రయత్నంకూడా చేసింది. ఆ రోజు ఇరవైతొమ్మిదో తారీఖు. నెలాఖరు. మిగతా ఇళ్ళలో లాభం లేదనుకుని వసంతనే రెండు రూపాయ లడిగింది.

కుటుంబంచిన్నదయినా పెద్దదయినా, చిన్న జీతగాళ్ళ కయినా పెద్ద జీతగాళ్ళ కయినా నెలాఖరు ఒక్కటే అని మంగమ్మ కేం తెలుసు? అందులోనూ మొన్నయిం ఒకటో తారీఖు కాని, ఫస్టు కాని ఆదివారం నాడు పడినా అవి వారికి ఎంత గడ్డు రోజులో ఆమెకు అసలే తెలీదు.

ఆ రోజే వసంత పోపుల డబ్బాలు, పెట్టె అడుగులీ, పిల్లలు దాచుకున్న చిల్లరనూ ఏరి ఒక దగ్గిర వేస్తే నాలుగు రూపాయలు పైచిలుకు అయింది. ఒక రూపాయి భర్త జేబులో వేసి మిగతా మూడు రూపాయలతో ఈ మూడు రోజులూ ఎలా గడపడమా అని బాధ పడుతూంది. ఫస్టు నాడు వచ్చిన ఆదివారాన్ని వంద సార్లయినా తిట్టుకుంది. ఆ సమయంలో మంగమ్మ రెండు రూపాయలు దీనంగా అడిగినా, కోపమే తెప్పించింది. "నెలాఖరున అడగటానికి నీ నోరెలా వచ్చింది? నా చేత లేదనిపించుకోవటానిగ్గాని. . ." అంటూ కసురుకుంది.

ఉస్సురంటూ వస్తూన్న మంగమ్మ గౌరమ్మను చూసింది. 'దీని దగ్గిర ఉంటాది కాని ఇవ్వదు. ఏదేనా కుదువ



## సమీక్ష

# 'నాతిచరామి'

డబ్బున్న కుటుంబాలలో, అందు లోనూ ఆడ దిక్కులేని దేవిడీ మన్నాలో పెరిగే యువతీ యువకుల ఆకార వికారాలు, ఆ ఇంటిలోని సమస్య లను ఆసరాగా తీసుకుని చేరే స్వార్థ పరుల నిజ స్వరూపాలు కళ్ళకు కట్టినట్టు చూపించే నాటకం 'నాతిచరామి'.

గారాబంగా పెరిగి విచ్చల విడిగా తిరిగే కూతురు, అమాయకత్వం నింపు కున్న కొడుకు— వీరిని చూసుకుని లోపల కుమిలి పోయే తండ్రి, వీరికి సమయానికి ఇంత ఉడకేసి పడేసే వంట బ్రాహ్మడు ఈ నాటకానికి ప్రధాన పాత్రలు.

ఈ రచనను ఒక మలుపు తిప్పించి కథను రక్తి కట్టించే హీరో ఆ ఇంటికి దొరికిన అల్లుడు.

ఆడదాని జీవితంలో కట్టుబాట్లు ఎంత అవసరమో, స్వాతంత్ర్యం శ్రుతి మించితే బతుకులో వినిపించే అపస్వరా లేమిటో రచయిత శ్రీ తారకరామారావు ముచ్చటగా చూపించారు.

ఈ నాటకాన్ని మద్రాసులోని సాహిత్య సాంస్కృతిక సంస్థ కళాభారతి వారు కళైవాసర్ అరంగంలో ఇటీవల ఏర్పాటు చేశారు. దీనిని శ్రీ ఎస్. ఎస్. శ్యామ్ సుందర్ డైరెక్ట్ చేశారు.

ఇందులో ఎస్. ఎస్. శ్యాంసుందర్, పి. వి. ఎస్. ఆర్. కృష్ణమూర్తి, జి. రామమూర్తి, జి. ఎస్. ఎన్. శాస్త్రి, ఎస్. తారక రామారావు, బి. లోకనాథం, ఎస్. సుబ్బారావు, బి. లక్ష్మణరావు, శ్రీమతి సి. సరస్వతి నటించారు.

అంతవరకూ భర్తని చీదరించుకునే రాధ ఉన్నట్లుండి ఒక్కసారి వచ్చిన మార్పుకు తగిన కారణం మరింత పటుత్వంగా చూపడానికి ప్రయత్నించి ఉంటే బాగుండేది.

ప్రదర్శనం చాలా బాగుంది. పాత్ర ధారుల నటన కథకు తగినట్లు ముచ్చటగా ఉంది. ఈ నాటకాన్ని శ్రీ కళానికేతన్, హైదరాబాదువారు ప్రదర్శించారు.

ప్రథమంలో కుమారి నిత్యకల్యాణి నాట్యప్రదర్శనం చేసింది.

— ఎల్లోరా

---

పెడితేనే ఇస్తాది' అనుకుంది. అయినా, నోరు విడిచి అడుగుదాం అనుకున్నా, ఆ చొక్కా చూసిన రోజు నుంచి తనతో మాట్లాడ్డమే మానేసింది.

కళ్ళు విప్పింది మంగమ్మ. పిచ్చి పిచ్చి శవాల్లా పడుకున్నారు బోడిగాడు, ఎడ పిల్ల, ఆకలితో కాలుస్తున్న శవాన్ని చూస్తున్న నక్కల్లా ద్వారం దగ్గిర ఉన్నారు పెద్దవాళ్ళిద్దరూ. నోరెత్తి అడగక పోయినా కడుపులోని ఆకలి ఒంట్లో నీరుగా జారి బుగ్గల మీద చారికలు కట్టింది. బయట వర్షం కురుస్తూనే ఉంది. ఇరుగు పొరుగు తన లాంటి వారే. పేట కల్లా కలిగినమ్మ గౌరమ్మ. కంటి ముందు తళతళ మెరిసే టెరిలిన్ చొక్కా. . . దసరా రోజు బోడిగాడు ఒంటిమీద. . . ప్చ్. అంతవరకూ ఈడు బతకాల్నా? కడుపులోని పేగులు మెలి తిరుగుతున్నాయి. ఆకలి ఒక వంతు. సంఘర్షణ ఒక వంతూ. . . ఆకలే జయించింది.

• • •

దసరా రోజు వచ్చింది. పనులు నిర్లిప్తంగా చేసుకుపోతూంది మంగమ్మ. సాయంత్రం బోడిగాణ్ణి చొక్కా తొడిగించి తెమ్మన్నది వసంత.

నోరెత్తలేదు మంగమ్మ. కళ్ళ నీళ్ళు చెమట తుడుస్తున్నట్టుగా కొంగుతో తుడిచేసుకున్నది.

సాయంత్రం పిల్లలకు తల దువ్వి కొత్త బట్టలు తొడిగింది వసంత. అంట్లన్నీ పడి ఉన్నాయి. మంగమ్మ కోసం చూస్తూంది. మంగమ్మ కొడుకు చేత టెరిలిన్ చొక్కా తొడిగించి వీధి లోంచి వస్తూంటే. . . వసంత ఉండ బట్టలేక గుమ్మంలోకి వచ్చింది.

గౌరమ్మ కొడుకు చేతిని పట్టుకుని వీధిలోంచి వెళుతూ వసంతను చూసి నవ్వింది. "మా యప్ప ఇంకా రాలే దేటమ్మా" అంది నిలబడి. వసంతకు గౌరమ్మ మాటలు చెవుల్లో పడలేదు. గౌరమ్మ కొడుకు ఒంటి మీద ఉన్న నీలం రంగు టెరిలిన్ చొక్కా. . .

"ఈ చొక్కా ఎక్కడిదే?"

"మంగమ్మ దగ్గిర మూడ్రూపాయ లెట్టి కొన్నానమ్మా. దాని కెందు కిలాటివి?" గర్వంగా చెబుతూ సాగి పోయింది.

గబగబా లోపలికి వచ్చింది. మంగమ్మ తనిచ్చిన చొక్కా డబ్బు చేసుకుందా చీ. . . పాపిష్టి మనుషులు! ఇచ్చినా తినలేరు, కట్టలేరు. ముష్టి మూడు రూపాయలు ఎన్నాళ్ళు తిన్నారు?

అప్పుడే వచ్చిన మంగమ్మను చూసి రెచ్చిపోయింది వసంత. తప్పు చేసిన దానిలా తల వంచుకుని నిలబడి పోయింది మంగమ్మ. గదిలోంచి బయటకు వచ్చాడు సుందరం. కోపంతో మండిపోతున్న భార్య ముందు తల వంచుకుని దీనంగా నిలిచి ఉన్న మంగమ్మను చూసి జాలి పడ్డాడు.

"వసంతా! ఏమి టా తొందర? కాస్త ఉండు. . ." అని "ఏం, మంగమ్మా, కొడుక్కి తొడిగించకుండా అమ్మేశావు?" బుజ్జగిస్తున్నట్టు అడిగాడు.

మంగమ్మకు ధైర్యం వచ్చింది. దుఃఖం పొర్లింది. ఏందు కమ్మవలసి వచ్చిందో చెప్పి పెరట్లోకి వెళ్ళిపోయింది.

ఆ కథ విన్న వసంత కోపం తగ్గినా, మంగమ్మ అమ్ముకోవటం సహించలేక పోతూంది. "అంతా దొంగ వేషాలు! ఒక్క పూట తిండి కోసం అమ్మేసిందట. ఓ యేడాది పాటు ఆ పిల్లాడు కట్టుకున్ను గదా?" అన్నది.

జాలిగా నవ్వాడు భార్యను చూసి సుందరం. "వసంతా! ఈ రోజు ఉన్న వాళ్ళు రేపటి గురించి ఆలోచిస్తారు. ఏడాది పాటు తొడుక్కోవటం కంటే ఆ రోజు వారి ఆకలి ముఖ్యం అని తెలుసుకో కుండా ఉన్నావేం? నీ దగ్గరున్న చిల్లరలో నించి ఓ రెండు రూపాయలు ఇవ్వగలిగి ఉంటే ఆ చొక్కా మంగమ్మకి మిగిలి ఉండేది! మూడు రూపాయలు ఆ సమయంలో నీ కెంత అవసరంగా ఉండేవో మరి. మరొకరి ఆర్తనాదం నీ చెవులకు సోకలేదు. మంగమ్మకి సాయం చేయ గలదు గౌరమ్మ. కాని, డబ్బు మోహంలో పడి సాటి మనిషి మీద నమ్మకం పోగొట్టుకుంది. ఈ టెరిలిన్ చొక్కా ఎన్ని మనస్తత్వాలను వెలికి తీసింది? పైసా విలువ చెయ్యలేదు నీ చెల్లెలికి. నీ కవసరం లేకపోయినా, మంగమ్మ నిన్ను కీర్తించాలన్న ఆశతోనే ఇచ్చావు కాని, జాలితో ఇవ్వలేదు నువ్వు. ఆ చొక్కా చూసింది మొదలు గౌరమ్మ కాజెయ్యాలనే చూసింది. తనకంటె మెట్టు తక్కువ లోనే ఉండాలి కాని, ఏ మాత్రం అదృష్టం వరించినా సహించలేక పోయింది.

అయితే, మీ రందరూ ఊహించ లేని విలువ ఆ టెరిలిన్ చొక్కాకి ఇచ్చింది మంగమ్మ. ఏ సాటి మనిషి చేయలేని సాయం ఆ టెరిలిన్ చొక్కా ఆ పూటకు ఆ కుటుంబాన్ని ఆదుకుంది . . ."

భర్త మాటలు వింటూన్న వసంత లోని భావాలు గజిబిజిగా ఉన్నాయి. నిజాన్ని ఒప్పుకోకపోయినా, అతడి మాటలు అబద్ధం అని తీసి పారెయ్య లేకపోయింది. *

